
ఆంధ్రజ్యోతి

5 వరంగల్

బుధవారం 7 ఫిబ్రవరి 2024

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్



పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్ నడుస్తోంది. తాము సిఫారసు చేసిన వారికే పోస్టింగులు ఇవ్వాలని మంత్రులు పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తుంటే.. తమ నియోజకవర్గాల్లో వారి పెత్తనమేంటని ఎమ్మెల్యేలు గుర్రుమంటున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు బదిలీలు మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలుగా మారాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడిజిల్లాలోనూ పోలీసుల పోస్టింగుల్లో రాజకీయ నేతల సిఫారసులు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి. దీంతో కొద్ది రోజుల నుంచి నేడు, రేపు పోలీసుల బదిలీలు అంటూ ప్రచారం జరుగుతున్నా.. పోస్టింగులు మాత్రం ఎవరికీ ఇవ్వడం లేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే బదిలీలకు బ్రేకులు పడుతున్నట్టు సమాచారం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

- నియామకాల భర్తీకి పోటాపోటీగా సిఫారసు లేఖలు
- ఒకే పోస్టుకు మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసులు
- తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోవద్దంటూ మంత్రులపై ఎమ్మెల్యేల గుర్రు
- వరంగల్ కమిషనరేట్‌తో పాటు జిల్లాలోనూ ఇదే తంతు
- ఎవరి మాట వినాలో తెలియక తల పట్టుకుంటున్న పైఅధికారులు
- పైరవీలు లేక లూప్ లైన్‌కే కొంతమంది పోలీసులు అధికారులు

వరంగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గెలిచిన ఎమ్మెల్యే లు, మంత్రులు తమకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ప్రధానంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో ఉన్న 45పోలీస్ స్టేషన్లతో పాటు రెండు మహిళ, మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఉన్న ఎస్ఐలు, సీఐలు, ఎనిమిది మంది ఏసీపీలు, ముగ్గురు డీసీపీల్లో అనేక మందికి స్థానచలనం కల్పించేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేపట్టారు. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో కూడా ఎస్ఐ, సీఐ. డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టి సారించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే బదిలీలు చేస్తే ప్రజల్లో తప్పుడు సంకేతాలు పోతాయని, కొద్ది రోజుల వరకు బదిలీల జోలికి వెళ్లవద్దని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించటంతో ఎమ్మెల్యేలు కొద్ది రోజులు వెనక్కుతగ్గారు. అయితే ఇటీవల బదిలీ పర్వం మొదలవడంతో పొలిటికల్ సిఫారసు లేఖలతో పోలీసులు తమ బదిలీల కోసం ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో అయిష్టంగా కొన్ని బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి వస్తున్న సిఫారసు లేఖలు పోలీసు ఉన్నతా ధికారులకు తలనొప్పులు తెచ్చిపెడు తున్నాయట. ఒకే పోస్టింగ్ కోసం రెండు మూడు సిఫారసు లేఖలు వస్తుండటంతో ఎవరు సూచించిన వారికి పోస్టింగ్ ఇవ్వాలో తెలియక పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న చర్చ జరుగుతోంది.

బదిలీల్లో పొలిటికల్ వార్..

ఏ శాఖలో లేనివిధంగా పోలీసు పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదేళ్లుగా కాంగ్రెస్ నేతలు అధికా రానికి దూరంగా ఉండటంతో తమకు అను కూలంగా ఉన్నవారికి పోస్టింగులు ఇప్పించుకునేం దుకు పోటీ పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పోలీసు పోస్టింగుల్లో ఎమ్మెల్యేల సిఫారసులతో పాటు మంత్రులు కూడా సిఫారసు లేఖలు ఇస్తుండటంతో పొలిటికల్ వార్ ముదురుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో ఓ పోలీస్ స్టేషన్‌లో సీఐ పోస్టింగ్ కోసం స్థానిక అధికార పార్టీ నేత ఓ సిఫారసు లేఖ ఇవ్వగా, అదే స్టేషన్ కోసం ఓ మంత్రి కూడా రెకమండ్ చేస్తూ లేఖ ఇచ్చారు. అలాగే పరకాల నియోజకవర్గం పరిధిలోని నగరానికి సమీపంలో ఉన్న ఓ పోలీస్ స్టేషన్‌కు ఓ సీఐ పేరును సూచిస్తూ రాష్ట్ర మంత్రి ఒకరు సిఫారసు లేఖ ఇవ్వగా, ప్రస్తుత సీఐనే కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యే పట్టు బడుతున్నట్టు సమాచారం. నగరంలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఏసీపీలు, సీఐ, ఎస్ఐల బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నర్సంపేట నియోజకవర్గంలోని ఓ సీఐ బదిలీలో మరో మంత్రి జోక్యంపై స్థానిక నేతలు నారాజ్‌గా ఉన్నట్లుగా సమాచారం. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐ, సీఐ, ఏసీపీ బదిలీల్లో ఓ మంత్రి జోక్యంపై స్థానిక కాంగ్రెస్ నేతలు అలకవహిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఓ పోలీస్‌స్టేసన్ సీఐ పోస్టింగు కోసం మరో మంత్రి సిఫారసు చేయడంపై స్థానిక ఎమ్మెల్యే కినుక వహించినట్టు చర్చ జరుగుతోంది. భూపాలపల్లి జిల్లాలో ఎమ్మెల్యే సిఫారసు చేసిన సీఐ పోస్టుకు మంత్రి కూడా మరో పేరును సూచించారని సమాచారం. ఇలా కమిషనరేట్‌తో పాటు జిల్లాలో పోలీసుల పోస్టింగుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు



మిగతా 8వ పేజీలో..

పైరవీ లేకుంటే లూప్‌లైన్‌లోకే..

ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొందరు నిజాయితీగా పని చేసే అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పడం లేదు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడు స్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీసుశాఖలోనే అధికంగా బదిలీలపై రాజ కీయ ఒత్తిళ్లు ఉంటాయనే చర్చ ఉంది. దీంతో డ్యూటీని నిజాయితీగా నిర్వహించే కొంత మంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్ప వనే చర్చ జరుగుతోంది. హనుమకొండ నగర శివారులో పని చేస్తున్న ఓ సీఐ ఏడాది క్రితమే పోస్టింగ్ వచ్చింది. నాలుగేళ్లు లూప్‌లైన్‌లో కొనసాగిన సదరు సీఐకి తాజా బదిలీల్లో పైరవీలు చేసుకునేందుకు ఇష్టం లేకపోవడంతో తిరిగి లూప్‌లైన్‌కు వెళ్లాల్సి వస్తుందనే ప్రచారం జరుగుతోంది.

ఇలా అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినప్పటికి, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్‌లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగు తుంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొంతమంది పోలీసుల నుంచి వినిపిస్తోంది.

త్వరలో వరంగల్‌కు సీఎం రేవంత్



హనుమకొండ సిటీ, జనవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాల తరువాత ఆయన రానున్నట్లు తెలిసింది. పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇటీవలే 'కుడా'లో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ సూత్రప్రాయంగా రేవంత్‌రెడ్డి పర్యటనను వెల్లడించారు. త్వరలోనే ఆయనను నగరానికి తీసుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ వర్గాల్లో కూడా రేవంత్ పర్యటన అంశం చర్చలో ఉంది. మేడారం జాతర.. ఆపై లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ప్రకటన కాక ముందే రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకురావాలనే యోచనలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందుకు అనుగుణంగా మేడారం జాతరకు ముందే తీసుకువచ్చి అభివృద్ధి పనులను ప్రారంభింప చేయడం సరైనదిగా భావిస్తున్నారు.

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

- మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్
- 18 నుంచి జాతరకు బస్సులు నడిపిస్తాం
- వరంగల్ రీజియన్‌లో 2,500 బస్సులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత

7

'గుడిమెలిగే'తో మహాజాతరకు నేడు అంకురార్పణ 8

తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు మెరుగవ్వాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



నల్లా నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 6 : నగరంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య సేవలు మరింత మెరుగవ్వాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని చింతగట్టు, హసన్‌పర్తి తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో నీటి సరఫరా, పారిశుధ్య సేవలను పరిశీలించారు. నల్లాలకు ఆన్ ఆఫ్ బిగించకుండా కొందరు నీటిని వృథా చేస్తున్నారని కమిషనర్ అన్నారు. దీనిపి పరిశీలించి యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లీకేజీలు అరికట్టాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలన్నారు. డ్రెయినేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మారుతీనగర్‌లో పారిశుధ్య కార్మికుల హాజరును కమిషనర్ పరిశీలించారు. విధులకు గైర్హాజరవుతున్న కార్మికురాలిని తొలగించాలని సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్‌ను ఆదేశించారు. జవహర్‌నగర్, రాజాజీనగర్ బ్రిడ్జి పనులను కమిషనర్ పరిశీలించారు. అక్రమంగా ఏర్పాటైన డబ్బాను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలన

- గ్రూప్-డి అధికారుల సందర్శన



చింతనెక్కొండలో డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి, ఫిబ్రవరి 6: మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని 16 మంది సెంట్రల్ సెక్రటేరియేట్ స్పెషల్ ఆఫీసర్స్(గ్రూప్ డీ అధికారులు) స్టడీ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం సందర్శించారు. దీనిలో భాగంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది విధుల గురించి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి వారి శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి తెలుసుకున్నారు. మండలంలో అమలవుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేంద్రప్రభుత్వ పథకాలు, కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాలు అమలుతీరును పరిశీలించారు. ఉపాధిహామీ విభాగం, పంచాయతీ విభాగం, ఐకేపీ విభాగం, కేజీబీవీ స్కూల్, రూర్బన్ పథకంలో నిర్మించిన షాపింగ్‌కాంప్లెక్స్, కన్వెన్షన్ హాల్, హెల్త్ సబ్‌సెంటర్స్, కూరగాయల పందిళ్లు, పల్లె ప్రకృతివనం, నర్సరీ తదితర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రూప్ డీ అధికారులు బప్పాడే, సౌమిత్ర బిశ్వాస్, అశ్విన్ వర్మ, నిఖిల్, జడ్పీ సీఈవో గూడూరి రామిరెడ్డి, డీఆర్ డీవో సంపత్‌రావు, ఏపీడీ వసుమతి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళను ప్రతీ ఒక్కరు అభ్యసించాలి

- త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6: భారత దేశంలో సాంస్కృతిక కళల్లో సంగీతం ఒక కళ అని ఆ కళను ప్రతీ ఒక్కరు అభ్యసించి ఉత్తీర్ణులవడం ఉత్తమమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను వరంగల్‌లోని పోతన విజ్ఞాన పీఠంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సంగీత కళాకారులతో కలసి త్యాగరాజ స్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వాళన గావించి త్యాగరాజ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా సంగీత కళాకారు లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రెండు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే కలెక్టర్ సంగీతం పట్ల మక్కువతో విద్యనభ్యసించి త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో కీర్తనలు పాడి అందరిని అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సుధీర్‌కుమార్‌తో పాటు కళాశాల అధ్యాపకులు అనుముల యోషా, వారి శిష్య బృందంతో పాటు పండిట్ శ్రీవిష్ణునారాయణ్ బాత్‌కండే చాట్ ఆధారంగా పది రాగాలలో రచించిన కీర్తనలను సంగీత కళాకారులు, విద్యార్థులు మహిత, దత్తాత్రేయ, ప్రవీణ్, వినయ్ పాల్గొన్నారు.

బీసీ కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- అసెంబ్లీలో విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలి..
- కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేయాలి
- జనగామను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ప్రకటించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 6: బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఏప్రిల్ 11న జ్యోతిబా పూలే జయంతిలోగా అసెంబ్లీలో విగ్రహం పెడతామని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని శ్యామల గార్డెన్స్‌లో భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీల హక్కుల సాధనకై రౌండ్ టేబుల్ సమావేశం మాజీ కుడా ఛైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవిత మాట్లాడుతూ.. 2006లో ఆవిర్భవించిన తెలంగాణ జాగృతి సంస్థ.. అనేక సామాజిక అంశాలపై గళమెత్తి సాధించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని పోరాడి సాధించుకున్నామన్నారు. ఎన్నికలకు ముందే జ్యోతిబా పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు చేసేందుకు రూపకల్పన చేశామన్నారు. అయితే పూలే జయంతిలోగా ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీలో విగ్రహం ఏర్పాటు చేయాలని, లేదంటే ఉద్యమించి సాధించుకుంటామని కవిత హెచ్చరించారు. ఓబీసీలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు బీసీ కులగణన చేస్తామని బీసీ డిక్లరేషన్ చేశారని, వెంటనే బీసీ గణన ప్రారంభించి ఆరు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. బీసీలకు ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకోవాలన్నారు.

2024-25 బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్దత కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న పేరును జనగామ జిల్లాకు పెడుతామని ప్రకటించిన కాంగ్రెస్.. మాట నిలబెట్టుకోవాలని ఆమె సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ ఉద్యోగాల్లో బీసీల వాటా దక్కడం లేదన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు జరిగిన యూపీఎస్ పరీక్షలో 4365మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ ఉద్యోగాలు సాధిస్తే ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేవలం 1,195 మందికి మాత్రమే ఉద్యోగాల పొందారని వివరించారు. జనరల్ కేటగిరీ వారే ఎక్కువ ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలోనే బీసీల పాత్ర అంతంత మాత్రమే నన్నారు. కేంద్రంలో బీసీ వెల్ఫేర్ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన రూ.26లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5వేల కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. కలిసి ఉందాం.. కలిసి కొట్లాడి బీసీల హక్కులను సాధించుకుందామని కవిత పిలుపునిచ్చారు.

యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. బీసీ కమ్యూనిటీ సమాజానికి వెన్నుముక అన్నారు. దేశంలో సగం ఉన్న బీసీలు నాగరికతకు అద్దం పడుతున్నారని ఆయన తెలిపారు. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. అందరి కోసం పోరాడిన మనం.. మన కోసం పోరాడి హక్కులు సాధించుకుందామన్నారు. పూలే జయంతిలోగా అసెంబ్లీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. బీసీలకు కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని ఆయన తెలిపారు. బీసీ హక్కుల సాధన కోసం ఏ కార్యక్రమం తీసుకున్నా తనవంతు పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు.

సభకు అధ్యక్షతన వహించిన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. 2014 ముందు బీసీల పట్ల చిన్న చూపు ఉండేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకనే బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పించబడిందన్నారు. 150 ఏళ్ల కిందటే జ్యోతిబా పూలే బీసీ వర్గాల్లో జ్యోతి వెలిగించారని ఆయన తెలిపారు. అసెంబ్లీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతీ బీసీ కుటుంబానికి పూలే పోటోలు పంపిణీ చేసి ఆయన గొప్పతనాన్ని చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు వి.ప్రకాశ్, దాస్యం విజయభాస్కర్, నాగరాజు యాదవ్, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, రాము, పులి రజనీకాంత్, వెంకట్రాజం, బయ్య స్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల మొదటి దశ తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంల తనిఖీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఈవీఎం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీ ప్రక్రియను మంగళ వారం కలెక్టర్ పి. ప్రావీణ్య పరిశీలించారు. ఏనుమాముల మార్కెట్ లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంలో కొనసాగుతున్న తనిఖీ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, ఈసీఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరిగే లోక్ సభ ఎన్నికల దృష్ట్యా మొదటి దశ తనిఖీ ప్రక్రియలో 1906 బ్యాలెట్ యూనిట్లు 1262 కంట్రోల్ యూనిట్లు 1209 వీవీ ప్యాడ్‌లను అధికారులు ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులు తనిఖీ నిర్వహిస్తున్నారు.ఐ

ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్న 9 మంది ఈసీఎల్ ఇంజనీర్లు అధికారులు సాంకేతిక నిపుణులు ఇప్పటి వరకు చేపట్టిన ప్రక్రియను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్లు ఎక్బాల్, నాగేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు బి.విశ్వనారాయణ, నాయబ్ తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బంది ఈసీఐఎల్ ఇంజనీర్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకే బాలరాముడి ప్రతిష్ఠాపన

- ప్రతిపక్షాల ఆరోపణ సిగ్గుచేటు
- రాష్ట్రంలో పది లోక్‌సభ సీట్లు గెలుస్తాం
- అయోధ్య బాలరాముడి దర్శన్ అభియాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 6: రాముడిపై బీజేపీ రాజకీయాలు చేస్తుందని అవగాహన లేకుండా ప్రతిపక్షాల ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ప్రజల అభీష్టం మేరకే అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన జరిగిందని అయోధ్య బాలరాముడి దర్శన్ అభియాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయోధ్య శ్రీ బాలరామ్ మందిర్ దర్శన్ అభియాన్‌పై సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అయోధ్య బాలరాముడి దర్శన్ అభియాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, కామరెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అయోధ్య రామాలయం దేశ ప్రజలందరికి చెందుతుందని, రాముడంటే సత్యానికి, ధర్మానికి, విశ్వాసానికి నిదర్శనమని, రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజలందరు దర్శనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్షాలు రాముడిపై రాజకీయాలు చేస్తున్నాయని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధిలో పయనిస్తుందని, దేశం కోసం మోదీ తీసుకుంటున్న నిర్ణయాల పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని అన్నారు. బాల్క సుమన్ సంస్కారం లేకుండా ప్రభుత్వం పై విమర్శలు చేయడం సరికాదని, రాజకీయాలలో హుందాతనం తగ్గిపోయిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విమర్శలను ప్రధాన ఎజెండాగా పెట్టుకోకుండా, పరిపాలన వైపు, అభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. నాయకులు హుందాగా వ్యవహరిస్తూ, ఎదుటి వారిని గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నాయకులు బాకం హరిశంకర్, వన్నాల వెంకట రమణ, గడల కుమార్‌యాదవ్, పొట్టి శ్రీనివాస్‌గుప్తా, బండి సాంబయ్యయాదవ్, మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన మోదీతోనే సాధ్యం


- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నర్సంపేట, ఫిబ్రవరి 6 : దేశాన్ని పాలించే శక్తి, యుక్తి సుస్థిర ప్రభుత్వాన్ని నడిపించే దక్షత ప్రధాని నరేంద్రమోదీకే ఉన్నాయని విశ్వసిస్తూ మళ్లీ ఆయన పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సిటిజన్స్‌క్లబ్‌లో మంగళవారం పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోమారు ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దేశంలో సంకీర్ణ ప్రభుత్వానికి తావులేకుండా సుస్థిర ప్రభుత్వాన్ని నడిపిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. గతంలో తాను రాష్ట్ర ఆర్థికమంత్రిగా పనిచేశానని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తనకు అవగాహన ఉందన్నారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేయ డం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాలను క్లస్టర్లుగా విభజించి ఇన్‌చార్జిలను నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కీర్తిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీమోర్చారాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నర్సంపేట అసెంబ్లీ ప్రభారి చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రేసుశ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, వడ్డెపల్లి నర్సింహరాములు, గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.









కేయూ ఎల్ఎల్‌బీ పరీక్షల ఫీజు గడువు 17

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సుల 3, 5, ఐదేళ్ల కోర్సుల 3,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధి కారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంలో ఫిబ్రవరి 20 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఎల్ఎల్ఎం కేయూ మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజులను చెల్లించుకోవాలని అధికారులు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్), ఎంబీఏ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరు ఫీజులు చెల్లించుకోవాలని రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఇద్దరు బీటెక్ విద్యార్థులపై కత్తితో దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట సగరకాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులపై ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఇదిగాని జెడ్సన్, గీసుగొండకు చెందిన కోల అరవింద్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు చెందిన తాటిపల్లి సుమంత్‌లు పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. కాగా, వారు ఉంటున్న ఇంటి సమీపంలో మరో ఇంటిలో పాముకుంట్ల రాకేశ్ అనే విద్యార్థి అద్దెకు ఉంటున్నాడు.

ఈ క్రమంలో రాకేశ్ సోదరుడు రాజ్‌కుమార్ తమ్ముడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి మద్యం సేవించిన తర్వాత తమ్ముడు ఉంటున్న గదిలో గట్టిగా అరవడం, అక్కడకు వచ్చిన వారిని దుర్భాషలాడి అల్లరి చిల్లర చేశాడు. ఇమేమిటని బయటకు వచ్చిన జడ్సన్, అరవింద్, సుమంత్‌లను హేళన చేస్తూ ఎందుకు వచ్చారు? చంపేస్తా..? అని బెదిరిస్తూ నానా దుర్భాషలాడాడు. భయపడి ముగ్గురు గదిలోకి వెళ్లగా వారి ఉంటున్న గదిలోకి రాజ్‌కుమార్ బలవంతంగా ప్రవేశించాడు. కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కత్తితో దాడికి దిగాడు. అరవింద్‌ను కత్తితో చాతిలో గట్టిగా పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన సుమంత్ చేతిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర కత్తి గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న అరవింద్‌ను 108 సహాయంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. జెడ్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

జనగామలో బెల్టుషాపుపై దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: జనగామలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.6వేల విలువ గల వివిధ రకాలైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణం వీవర్స్‌కాలనీలో ఉంటున్న రంగు నాగయ్య అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యాన్ని పట్టుకున్నారు. నాగయ్యను అరెస్టు చేసి విచారించారు.







మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీలత

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్

ఈనెల 18 నుంచి నిరంతరం బస్సులు నడిపిస్తాం..

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత



మేడారంలో సిద్ధం చేస్తున్న బస్టాండ్ ప్రాంగణం

హనుమకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ బస్సులను నడపబోతోంది. ప్రతీసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారు. వీరిలో 20 లక్షల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లోనే వనదేవతల సన్నిధికి చేరుకుంటారు. ఈ సారి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో జాతరకే రావచ్చునని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఏర్పాట్లను కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణ ఏర్పాట్లపై ఆర్టీసీ వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ఆరు వేల బస్సులు

మేడారం జాతరకు ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 41 ఆపరేషన్ పాయింట్ల నుంచి ఆరువేల బస్సులను నడపనున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 డిపోల పరిధిలో 17 పాయింట్ల నుంచి 2500 బస్సులను నడుపుతాం. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 2800 బస్సులనే నడిపాం. కరోనా వల్ల భక్తుల రద్దీ లేకపోవడంతో బస్సుల సంఖ్య కూడా తగ్గింది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఇంకా ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ మేరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రతగా బస్సుల సంఖ్యను కూడా పెంచుతున్నాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో రానున్న వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడపడం అంటూ ఏమీ ఉండదు.

ఈ నెల 18 నుంచి బస్సులు

ఈనెల 18 నుంచి మేడారానికి బస్సులు క్రమంగా నడుపుతాం. ఇప్పటికే జాతరకు బస్సులు నడుపుతున్నాం. ప్రతీ రోజు 50 బస్సులు మేడారానికి వెళుతున్నాయి. ప్రతీ బుధ, ఆదివారాల్లో 79 బస్సులు వెళుతున్నాయి. జాతర ముగిసే వరకు బస్సుల నడుస్తాయి. అప్పటి వరకు అన్ని రూట్లలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ సారి 40లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం.

55 ఎకరాల్లో బస్‌స్టేషన్

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి మేడారంలో బస్‌స్టాండ్‌ను కూడా మరింత విశాలంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇది వరకు 40 ఎకరాల్లో బస్‌స్టాండ్ ఏర్పాటు చేసేది. ఈ సారి అదనంగా మరో 15 ఎకరాల స్థలం అదనంగా తీసుకున్నాం. మొత్తం 55 ఎకరాల్లో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. క్యూలైన్లను కూడా పెంచుతున్నాము. ఇదివరకు బస్‌స్టాండ్‌లో 39 క్యూలైన్లు ఉండేది. ఈసారి ఈ సంఖ్యను 45కు పెంచుతున్నాం. బస్టాండ్‌లో భక్తుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాగునీటి కోసం రెండు ఆర్‌వోఆర్ ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులో ఒకటి బస్‌స్టాండ్, రెండోది క్యూలైన్ల వద్ద ఉంటుంది. ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు, తగిన మార్గదర్శనం నెరిపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం 80 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నాం.

పార్కింగ్‌కు అదనపు స్థలం

ఈ బస్సు సంఖ్య పెంచినందువల్ల పార్కింగ్ సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారంలో బస్‌స్టాండ్‌లో 2వేల బస్సులు నిలిచేందుకు మాత్రమే స్థలం ఉంది. మిగతా బస్సుల పార్కింగ్ కోసం కామారం వద్ద 18 ఎకరాలతో అదనంగా మరో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బస్‌స్టాండ్‌లో బస్సులు ఖాళీ అవుతుంటే కామారంలో పార్కింగ్ చేసిన బస్సులను ఇక్కడికి పంపిస్తాం. దీనివల్ల బస్‌స్టాండ్‌లో ఒత్తిడి తగ్గుతుంది. రద్దీ సమస్య ఉండదు.

రీజియన్ నుంచి 50 శాతం సర్వీసులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని మొత్తం 741 బస్సుల్లో 365 బస్సులను మేడారం స్పెషల్‌గా నడుస్తున్నాయి. మిగతావి రీజియన్ పరిధిలోనే ఆయా డిపోల పరిధిలోని జాతర బస్ పాయింట్ల వద్దకు ప్రయాణికులను చేరవేయడానికి నడుస్తాయి. జాతరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తాయి. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు నడుస్తాయి.

150 కొత్త బస్సులు

జాతర కోసం ప్రస్తుతం ఉన్నవాటితో పాటు 150 కొత్త బస్సులను కూడా నడపనున్నాం. వరంగల్ రీజియన్‌కు 50 కొత్త బస్సులు వచ్చాయి. వీటితో పాటు అదనంగా మరో 100 కొత్త బస్సులను జాతరలో నడపాలని నిర్ణయించుకున్నాము. కొత్త బస్సులు ఈ నెల 18 నుంచి జాతర భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

15వేల సిబ్బంది

జాతరలో బస్సుల నిర్వహణకు 15వేల మందిని నియమిస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, ట్రాఫిక్ అధికారులు, మెకానిక్‌లు తదితర సిబ్బంది వీరిలో ఉంటారు. బస్సుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

నాలుగు చోట్ల మెకానికల్ క్యాంపులు

జాతరలో సాంకేతిక సమస్యలు తలెత్తి మార్గ మధ్యలో ఎక్కడైనా బస్సులు నిలిచిపోయిన పక్షంలో తక్షణం అక్కడకు చేరుకొని వాటికి మరమ్మతులు చేసేందుకు నాలుగు చోట్ల - మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద మెకానికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉంటారు. వీరు ఎక్కడ బస్సు నిలిచిపోయినా తక్షణం అక్కడి వెళ్లి వాటిని బాగు చేస్తారు. బాగుకాకపోతే ఆ బస్సును క్రేన్ సహాయంతో పక్కన పెడతారు. పన్నెండు మొబైల్ వ్యాన్ల (డీజీబీ)ను కూడా తాడ్వాయి, నార్లాపూర్, పస్రా, గట్టమ్మ దేవాలయం, ఘనపూర్, కాటారం తదితర ప్రాంతాల్లో ప్రతీ 25 కి.మీ. ఒకటి చొప్పున అందుబాటులో ఉంటాయి. ఈ మొబైల్ వ్యాన్లను బస్సును బాగు చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంటాయి. చెడిపోయిన బస్సుల వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని ఎత్తి పక్కన పెట్టేందుకు రెండు క్రేన్లు, ఒక ట్రాక్టర్‌ను సైతం సిద్ధంగా ఉంచుతున్నాం. ఈ మొబైల్ వ్యాన్లలో ఉన్నవారి ఫోన్లను డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఇస్తాం. వారు ఎక్కడైనా బస్సు ఆగిపోతే వారు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మొబైల్ వ్యాన్ తక్షణం అక్కడి చేరుకొని బస్సుకు మరమ్మత్తు చేస్తుంది.

వైర్‌లెస్ సెట్లు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవి సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తు న్నాం. ఇందుకోసం స్వాడ్లను ఏర్పాటు చేస్తున్నాం. 15 జీపులు, 6 మోటార్ సైకిళ్లపై వీరు తిరుగుతూ బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు. వైర్‌లెస్ సెట్లద్వారా సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రతీ 25 కి.మీ. మధ్య ఒక స్క్వాడ్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. జాతర మార్గం మొత్తాన్ని ఈ స్క్వాడ్లు కవర్ చేస్తూ ఉంటాయి.

ట్రాకింగ్ పరికరాలు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను నిరంతరం గమనించేందుకు ట్రాఫిక్ డివైస్‌లను కూడా వినియోగిస్తున్నాం. హనుమకొండ -మేడారం మధ్యలో వీటిని ఉపయోగిస్తాం. తాడ్వాయి- మేడారం మధ్య ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా పనిచేసేదానిపై వీటి వాడకం ఉంటుంది. అయితే హనుమకొండ- తాడ్వాయి మధ్య మాత్రం ఇవి పని చేస్తాయి. హనుమకొండ ఆర్ఎం కార్యాలయంలోని సెంటర్ కామాండ్ సిస్టమ్‌లో ఈ ట్రాకింగ్ డివైస్‌లు అనుసంధానం అయి ఉంటాయి. బస్సులు ఎలా నడుస్తున్నాయి? ఎంత వేగంతో నడుస్తున్నాయి? ఎక్కడైనా నిలిచి పోయాయా? ఏదైనా బస్సుకు సమస్య వచ్చిందా? అనేది కమాండ్ కంట్రోల్ రూంలోని మానిటర్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాం. ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా ఈ మానిటర్ల ద్వారా తెలుసుకోవచ్చు.

బస్ పాయింట్లు

మేడారం వెళ్లే భక్తుల కోసం నగరంలో, అన్ని డిపో కేంద్రాల్లో 17 బస్సు పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల వద్ద, అలాగే హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. జనగామలోని ప్రిస్టన్ స్కూల్, స్టేషన్‌ఘనపూర్, తొర్రూ రు, వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట, కొత్తగూడ, పరకాల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, కాళేశ్వరం, కటారం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రయాణికులతో బస్సులు నిండగానే వెంట వెంటనే బయలుదేరుతాయి.

మేడారం ప్రధాన ద్వారం ముస్తాబు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రధాన ద్వారాన్ని రంగురంగులతో ముస్తాబు చేస్తున్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21నుంచి 24వతేదీ వరకు జరిగే మహాజాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మేడారం ఆర్చ్, గేటుకు రంగురంగులతో సమ్మక్క-సారలమ్మ దేవతల విగ్రహాలకు, సలహారానికి ముస్తాబు చేస్తున్నారు. ఈఏడాది అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఈప్రాంతాన్ని అధికారులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తాడ్వాయిలో ఎక్సైజ్, పోలీస్, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర విభాగాల అధికారులు వారంరోజులపాటు ఉండేందుకు బస ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారంరోజుల్లో ఏర్పాటుచేసిన బస కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏది ఏమైనప్పటికీ బుధవారం నుంచి మేడారం జాతర ఆరంభానికి నాంది పలుకుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.



తాడ్వాయిలో ముస్తాబు అవుతున్న తోరణం



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వన దేవతలకు భక్తుల మొక్కులు

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం మహాజాతరకు ముందుగా తరలివస్తున్న భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం 30వేలకుపైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి గద్దెల వద్దకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాట మొక్కులు తీర్చుకుని మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేశారు.

ములుగును సమ్మక్క సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 6: ములుగుకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్ ప్రాంగణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు వనదేవతల పేర్లను అధికారికంగా ప్రకటించాలన్నది ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. గత ఏడాది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు సమ్మక్క, సారలమ్మల పేరును అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నూతనంగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు ఆయా ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాల పేర్లు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, ఉపాధ్యాయుల సంఘం, నగరభేరి రాష్ట్ర కార్యదర్శి పోరిక ఉదయ్ సింగ్, పలు సంఘాల నాయకులు శ్రీనివాస్, నవీన్, వేణు, చింత కృష్ణ, శ్రావణ్, కృష్ణప్రసాద్, మహేష్, రత్నం, పూజారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సందర్శించిన డీఎంహెచ్‌వో



వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం, ఫిబ్రవరి 6: తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య మంగళవారం సందర్శించారు. వైద్య సేవల రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మంగళవారం వరకు 3,250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చికిత్స పొందిన భక్తుల్లో అధికంగా గొంతు నొప్పి, జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలతో వచ్చిన వారు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు అందించామని తెలిపారు. ఆది, బుధవారాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY
వరంగల్ సిటీ
● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం
బుధవారం 7 ఫిబ్రవరి 2024

నాగేంద్రుడికి పుష్యమాస పూజలు

గీసుగొండ, ఫిబ్రవరి 6: మండలంలోని ఊకల్ నాగును బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి ఉత్తరాయణ పుష్యమాస ఏకాదశి పూజలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర వైద్యవిధాన మండలి సభ్యుడు డాక్టర్ వడ్డి నరేష్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సముద్రాల సుదర్శనా చార్యులు, శ్రీహర్ష చార్యులు, ఎంపీటీసీ వీరారావు, ఆలయ చైర్మన్ బాబురావు, కొత్తగట్టు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పుష్పాల అలంకరణలో నాగేంద్రుడు

టెక్నికల్ హబ్ ఏర్పాటు ఓ మైలురాయి



మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 6: టెక్నికల్ హబ్ ఏర్పాటు వరంగల్‌కు మైలురాయిగా నిలువనుందని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్‌లో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు మంత్రి మండలి అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, బత్తుల నీవన్‌కుమార్ మంత్రి సురేఖను హైదరాబా ద్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. టెక్నికల్ హబ్ ఏర్పాటుతో వరంగల్‌కు కొత్త కళ వస్తుందన్నారు.

సాంకేతిక నగరంగా వరంగల్

● రంగశాయిపేటలో రూ.200 కోట్లతో టెక్నికల్ సెంటర్ ● యువత, వృత్తి పనుల వారికి నైపుణ్య శిక్షణ ● ఏర్పాటులో మంత్రి సురేఖ కీలకపాత్ర

శంభునిపేట, ఫిబ్రవరి 6 : వరంగల్ నగరం మరింత సాంకేతిక నగరంగా మారనుంది. ఇప్పటికే నిట్ లాంటి అగ్రశేణి విద్యా సంస్థలుండగా కొత్తగా టెక్నాలజీ సెంటర్ లాంటి ప్రపంచ శ్రేణి సంస్థను వరంగల్‌లో ఏర్పాటు చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో స్థానిక తూర్పు ఎమ్మెల్యే , రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలకపాత్ర పోషించారు. వృత్తి శిక్షణ లాంటి కోర్సులతో పాటు కుటీర, చిన్నతరహా పరిశ్రమల నిర్వాహకులకు. పనివారికి సాంకేతిక నైపుణ్యాలు అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను మంజూరు చేయగా.. అందులో రాష్ట్రానికి దక్కే టెక్నికల్ సెంటర్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను ఆమె ఒప్పించారు. దీంతో తెలంగాణకు కేటాయించిన ఏకైక యూనిట్‌ను వరంగల్‌లో ఏర్పాటు కానుంది. దీనికి అనుకూలంగా సోమవారం మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది.

రూ. 200 కోట్ల నిధులు..

సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైపుణ్య అభివృద్ధి శిక్షణను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్ల నిదులను అందించనుంది. అందుకు అనుగుణంగా వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం రంగశాయిపేట శివారులో ఈ టెక్నికల్ సెంటర్ (హబ్)ను ఏర్పాటు చేసేలా రెవెన్యూ అనువైన స్థలాన్ని గుర్తించింది.

యువతకు ఉపాధి అవకాశాలు..

జిల్లాలో చాలామంది నిరుద్యోగులతో పాటు ఐటీఐ. డిప్లొమా లాంటి వృత్తి శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సాంకేతిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందిస్తారు. తద్వారా ఉపాధి అవకాశాలతో పాటు అదనపు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటారు. స్వయం ఉపాధి చేసుకునే వృత్తి పనుల వారికి, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమల వారికి సాంకేతి క శిక్షణను అందిస్తారు. నగరంలోని వేలాది మంది ఈ కేంద్రం ద్వారా ఉపాధి మార్గాలను మెరుగుపరుచుకోవడంతో పాటు సాంకేతికతను ఉపయోగించుకోవటానికి వీలుపడుతుంది. ఈ టెక్నికల్ సెంటర్ ఏర్పాటు అయితే వరంగల్ నగరం దక్షిణ భారత టెక్నికల్ సిటీగా మారనుంది. అందుకు బాటలు వేసిన మంత్రి కొండా సురేఖను ఈ సందర్భంగా పలువురు మేదావులతో పాటు నాయకులు నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

గీసుగొండ, ఫిబ్రవరి 6: వంచనగిరిలోని మోడల్‌స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు గాను ఈ నెల 22 లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష రుసుం రూ. 125, ఇతరులకు రూ.200 ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు విద్యార్థి కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలను పాఠశాలలో అందించాలని కోరారు.

విద్యతోనే భవిష్యత్‌కు బంగారు బాటలు

శంభునిపేట, ఫిబ్రవరి 6 : బాలబాలికలు విద్యతోనే తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా లయన్స్ క్వెస్ట్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు విద్య అనే అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, అభివృద్ధి అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మార్గం ప్రభాకర్, మండల పరుశరాములు, లావణ్య, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

శంభునిపేట, ఫిబ్రవరి 6: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ గుస్తి జె నోరియా సూచించారు. నగరంలోని రంగశాయిపేటలో గల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం 5వ వార్షికోత్సవ క్రీడలు అంగరంగ వైభవంగా జరిగాయి. క్రీడల్లో భాగంగా హాకీ, ఆర్చరీ, బ్యాడ్మింటన్, క్రీడలలో రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు పొందిన క్రీడాకారులచే జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం చైర్మన్ నోరియా విద్యార్థులకు బహుమతులు అందించి మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం ఎల్.సరితారెడ్డి పాఠశాల వార్షిక విద్యా నివేదికను సమర్పించారు. విద్యార్థులు కవాతుతో అతిదులకు గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఎస్ సొసైటీ మాజీ చైర్మన్ జగదీశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అప్పెందర్‌బాబు, జలగం వెంకట్రావు, రామాంతాపూర్ బ్రాంచి ప్రిన్సిపాల్ నరసింహారెడ్డిలతో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధికి విద్య తోడ్పాటు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 6: విద్య వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే ద్వితీయ వైజ్ఞానిక మహా సభలను జయప్రదం చేయాలని మంగళవారం వరంగల్, ఖిలావరంగల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. గిర్మాజీపేట, మట్టెవాడ, రంగంపేట, రంగశాయిపేట, క్రిష్టియన్ కాలనీ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. విద్య విలువను ఈ సందర్భంగా వివరించారు.

మంత్రి సురేఖ చిత్రపటానికి క్షీరాభిషేకం

వరంగల్‌టౌన్ : వరంగల్‌లో రూ.200 కోట్లతో టెక్నికల్ సెంటర్ ఏర్పాటు చేసి యువ తకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ందు కు మంత్రివర్గాన్ని సైతం ఒప్పించిన మంత్రి కొండా సురేఖ కృషి అభినందనీయమని టీపీసీ సీ కార్యదర్శి మీసాల ప్రకాష్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు లాజర్ ఆధ్వర్యంలో మంత్రి సురేఖ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. వరంగల్ పురోభివృద్ధికి ఈ టెక్నికల్ సెంటర్ ఎంతో ఉపయోగప డుతుందన్నారు. జంగం ప్రభాకర్, గుల్లపల్లి రామక్రిష్ణ, మంద శ్రీనివాస్, విశాల్ బాబు, కొండమీది సదానందం, రాజేందర్, అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాశిబుగ్గ జంక్షన్‌లో కాంగ్రెస్ సిటీ ప్రెసిడె ంట్ నారగోని స్వప్న మురళీగౌడ్ ఆధ్వర్యంలో సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం, స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కర్యక్రమానికి అతిథిగా టీపీసీసీ ప్రతినిధి నల్గొండ రమేష్ హాజరై స్వీట్లను పంపిణీ చేశారు. టపాసులు కాల్చారు. సురేఖ కృషిని కొనియాడారు.



మంత్రి సురేఖ చిత్రపటానికి అభిషేకం చేస్తున్న నాయకులు

జీడబ్ల్యూఎంసీ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం : పరిరక్షణ కమిటీ

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 6:గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రిజ్వాన్ బాషా, ఇతర అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చిన్నవడ్డేపల్లి చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ హెచ్చరించారు. నగరంలోని కాశిబుగ్గలో చెరువుల పరిరక్షణ సొసైటీ కార్యాలయంలో కమిటీ కార్యకవర్గం అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషల్‌లో చిన్నవడ్డేపల్లి చెరువులో ఉన్న గుర్రపుడెక్క, అలాగే వినాయక విగ్రహాల వ్యర్థాలను తొలగించాలని ఫిర్యాదు చేయడానికి వెళ్లిన చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడిపై అలాగే కమిటీ సభ్యులపై కమిషనర్ రిజ్వాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. అంతేగాకుండా వీరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనడాన్ని సొసైటీ తీవ్రంగా ఖండించింది. సమావే శంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి సిలువేరు నగేష్, ఉపాధ్యక్షుడు పోతన వెంకటేశ్వర్లు, కార్యదర్శి కాంతికుమార్, కోశాధికారి మాటేటి అశోక్‌కుమార్, కార్యవర్గ సభ్యులు సిలువేరు శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మామునూరు, ఫిబ్రవరి 6 : ప్రజలకు సేవ చేయడానికి వృత్తి ఏదైనా అంకితభావంతో పని చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు చెప్పారు, మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో మంగళ వారం ఎమ్మెల్యే నాగరాజుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బెటాలియన్ ప్రధాన పరిపాలన భవన ఆవరణలో ఎమ్మెల్యే నాగరాజు చెట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ పోలీసులతో పాటుగా రిటైర్డ్ పోలీసు అధికారులు, అభిమానులు, క్లాస్‌మెంట్ బంధువులు, స్నేహితులు ఎమ్మెల్యే నాగరాజును ఘనంగా సత్కరించి సన్మానించారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, మామునూరు ఏసీపీ సతీష్ బాబు, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనితా రంజిత్ రావు, రిటైర్డ్ పోలీసు అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంటా నరేందర్‌రెడ్డి, ప్రభాకర్ గౌడ్, చింత ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజును సన్మానిస్తున్న ఫోర్త్ బెటాలియన్ పోలీసులు

ఎమ్మెల్యే నాగరాజుకు సన్మానం

43వ డివిజన్ మామునూరు క్యాంపు జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే నాగరాజును ఘనంగా సత్కరించి సన్మానించారు. పూర్వ విద్యార్థి సంపత్ అధ్యక్షత వహించగా జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి, ప్రముఖ న్యాయ వాది శేఖర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనిధి శర్మ, కార్పొరే టర్ అనిత రంజిత్ రావు, ఏసీపీ సతీష్ బాబు, సీఐ కాంత్రి కుమార్, ఎస్ఐ కృష్ణవేణి, పోశాల స్వామి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

గిర్మాజిపేట, ఫిబ్రవరి 6 : దేశ వ్యాప్తంగా ఈనెల 16న కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ పోస్టర్ ఆవిష్కరించింది. వరంగల్ సీకేఎం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆసుపత్రి శాఖ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆసుపత్రి శాఖ అధ్యక్షుడు కె.రాజు, కార్యదర్శి ఎన్.శంకర్‌లతో కలిసి ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీకేఎం ఆసుపత్రి సిబ్బంది సక్కుబాయి, శోభ, రఘు, వరప్రసాద్, సంధ్య, కళ్యాణి, పద్మ, అనిత, సురేష్, వీరన్న, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 16న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బీడీకార్మిక ఐక్య పోరాట కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ మంగళవారం నర్సంపేట రోడ్డులోని బీడీ ఫ్యాక్టరీలో ప్రచారం చేసింది.

వరంగల్ కలెక్టరేట్ : ఈ నెల 16న దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె, భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆల్ మిల్లు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీఐటీయూ ఉపాధ్యక్షులు ఇనుముల శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం నగరంలోని పలు ప్రాంతాల్లో కార్మికులు, హమాలీలు, పవర్‌లూమ్స్ కార్మికులు కలిసి సమ్మె నోటీసు కరపత్రాలను వారికి అందజేశారు. యూనియన్ ప్రసిడెంట్ నాయిని రమేష్ రాష్ట్ర నాయకులు సుదిమళ్ల అశోక్, ఇసంపెల్లి కరుణాకర్, రాజు, హమాలీలు శ్రీనివాస్, గోపాల్, గంద్రాతి రాజు, ఆకుల మల్లయ్య, సుంకరి రాజు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్‌టౌన్, కార్మిక సమ్మెను పురస్కరించుకుని ఏనుమాముల మార్కెట్ సెలవు ప్రకటించాలని కోరుతూ ఆల్ ఇండియా సెంటర్ ఫర్ ట్రేడ్ యూనియన్(ఏఐసీటియూ) ప్రతినిధుల బృందం మార్కెట్ కార్యదర్శి కె. సంగయ్యను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర ప్రతాప్, నలివెల రవి, అయితం నగేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహాజాతరకు
నేడు అంకురార్పణ
మేడారంలో గుడిమెలిగే పండుగకు సర్వం సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడిమెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు.

శివనగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

ఖిలావరంగల్, ఫిబ్రవరి 6: అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరఢా జలిపిస్తుంది. తూర్పు నియోజకవర్గంలోని శివనగర్ అండర్‌బ్రిడ్జి వద్ద రోడ్డుకు సమీపంలో ఉన్న భవనాన్ని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎస్కవేటర్‌తో మంగళవారం ఉదయం కూల్చివేశారు. 34వ డివిజన్ అండర్‌బ్రిడ్జి సమీపంలో ఇటీవల నిర్మించిన బహుళ అంతస్తును నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్‌ప్లేస్ లేని కారణంగా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సిటీ ప్లానర్ వెంకన్న, టీపీఓ సుష్మ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ సిబ్బంది, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్!

(5వ పేజీ తరువాయి)

పోటాపోటీగా సిఫారసు లేఖలు ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసుల బదిలీల్లో రాజకీయం జోక్యం మితిమీరిపోతుండటం చర్చనీయా శంగా మారింది. ప్రతీ జిల్లాలో ఎమ్మెల్యేలు ఒక పేరు సూచిస్తే.. మంత్రులు ఇంకో పేరు సూచిస్తూ సిఫార సు లేఖలను పోలీసు ఉన్నతాధికారులకు అంద జేస్తున్నారు. దీంతో 'కరవమంటే కప్పకు.. విడవ మంటే పాముకు కోపం' అన్న చందంగా పోలీసు పైరవీలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. మంత్రుల సిఫారసు లేఖలను అమలు చేయాలా? ఎమ్మెల్యేల లేఖలకు విలువ ఇవ్వాలా? తెలియక ఉన్నతాధికారులు బదిలీపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారట. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐ, ఏసీపీ, డీసీపీల బదిలీలంటూ నాలుగైదు రోజులుగా ప్రచారం జరుగుతున్నా ఆర్డర్స్ మాత్రం బయటకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లే కారణమనే చర్చ జరుగుతుండగా.. ఒకేసారి భారీగా బదిలీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు పోలీసు అధికారులు కూడా తమకు ఇష్టమైన పోస్టింగు కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి దగ్గరి వారికి వారు పోస్టింగుల కోసం సిఫారసు లేఖలు ఇస్తున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య అంతర్గతంగా వాగ్వాదం జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే 'నా నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేదే లేదు. నీకు దండం పెడుతా నా పని నన్ను చేసుకొనివ్వు' అంటూ మంత్రితో వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. కాగా, రాజకీయ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పార్లమెంట్ ఎన్నికల వరకు ఎలాంటి బదిలీలు వద్దని జిల్లా, కమిషనరేట్ పోలీసు బాసులు పై అధికారులకు సూచిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య బదిలీలపై మనస్పర్థలు పెరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బదిలీలపై ఆశతో ఉన్న పోలీసు అధికారులకు ఇప్పట్లో బదిలీలు ఉంటాయా.. లేక మేడారం మహాజాతర, పార్లమెంట్ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందేనా అనే ఉత్కంఠతో ఉన్నారు.

అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన సదస్సు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం 2022లో అగ్నిపథ్ స్కీంను తీసుకొచ్చిందని ఈ పథకం ద్వారా త్రివిద దళాల్లో ఎంపిక జరుగుతుందని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎన్. మాధవి అన్నారు. ఎల్బీ కళాశాలలో జరిగిన తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్ అవగాహన సదస్సులో పలు అంశాలను వివరించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 11న ముగుస్తుందని వయో పరిమితి పదిహేడున్నర సంవత్సరాల నుంచి 21 ఏళ్ల వరకు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎయిర్‌ఫోర్స్ సీనియర్ అధికారి రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు డి. మిశ్రా, కళాశాల ప్రిన్సిపల్ అరుణ, సీకేఎం కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లను వెంటనే పిలవాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ప్రతీ వేసవి సీజన్‌లో అటవీ ప్రాంతంలో ఉండే గిరిజనులు, గిరిజనేతరులు తునికాకును సేకరిస్తారని తద్వారా వచ్చే ఆదాయంతో జీవనం కొనసాగిస్తారని అట్టి తునికాకు 50 ఆకుల కట్టకు రూ. 5 ధర ప్రభుత్వమే నిర్ణయించి తునికాకు టెండర్లను వెంటనే పిలువాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నేతలు మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు గిరిజనులు అడవిలో ఆకు సేకరిస్తారని ఆ సమయంలో అడవి జంతువులు, పాములు, తేళ్ల భారినపడి మరణించే ప్రమాదం కూడా ఉం దని వారన్నారు. గత బోనస్ డబ్బులను వెంటనే చెల్లించి తునికాకు టెండర్లను పిలిచి కూలీలను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేనందున కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీకాంత్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, బండి కోటేశ్వర్‌రావు, నున్నా అప్పారావు, గంద్రాతి హరిబాబు, ఇనుముల క్రిష్ణ, మంద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

మామునూరు, ఫిబ్రవరి 6 :తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని అంబేద్కర్ జంక్షన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమురెల్లి, మన్నె బాబురావు, కెఆర్ మూర్తి, జాఫర్ బాబా, చంద్ర మౌళి, చింత ప్రకాష్, సింగారపు అరుణ, సుభాకర్ రావు పాల్గొన్నారు.

● గీసుగొండ : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను కొనాయిమాకుల వద్ద వరంగల్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాయిలి ప్రభాకర్, కూసం రమేష్, నాగారం స్వామి, ఆకుల రుద్రప్రసాద్, వజ్ర రాజు, మర్రి క్రాంతి, వెంకటేష్, భద్రునాయక్, నర్సింహ, మాదాసి రాంబాబు, ప్రవీణ్, సబిత, అనసూర్య, కందికొండ రాజు తదితరులు పాల్గొన్నారు. గీసుగొండలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్ మాట్లాడుతూ బాల్కసుమన్‌ను చెప్పుతో కొట్టి తెలంగాణ నుంచి తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. నాయకులు దౌడు ప్రవీణ్, కోట యాకూబ్, అభిలాష్, జీవన్, కరుణాకర్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు మంగళవారం దహనం చేశారు. లేబర్‌కాలనీ బస్టాండ్ వద్ద 18వ, డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జన్ను రవి, నాయకులు ఈసంపెల్లి ప్రభాకర్, జన్ను రమేష్, అయిత సురేష్, మడిపల్లి సెబాష్టియన్, మడిపల్లి జాషువా, బల్ల భాస్కర్, సర్వర్‌పాష, వినయ్‌కుమార్, బరిగల ప్రకాశ్ పాల్గొన్నారు.



బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● శంభునిపేట :తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా మంగళవారం 42వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు కేడల పద్మ, ఎలుగు సాంబేశం, దామెరకొండ కరుణాకర్, నాగోని స్వప్న, మంతెన సునిత, ఇటికాల అశోక్, ఎమ్డీ బషీర్, బొలుగొడ్డు అనిల్ , విలాసాగరం శ్రీను, పూసల కిరణ్, మునుకుంట్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

● సంగెం : బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మండలకేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. గుమ్మడి హరిబాబు, బిక్కిరెడ్డి సంధ్యారాణి, కవిత పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 7 ఫిబ్రవరి 2024
వరంగల్ రూరల్
• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఇండియన్ ఆర్మీలో ఇల్లంద వాసి ప్రతిభ

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన జెల్ల శ్రీనివాస్ ఇండియన్ ఆర్మీలో ప్రతిభ కనబరచడంతో ఆయనకు సత్కారం లభించింది. జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ రాజోరి పాకిస్తాన్ బార్డర్‌లో శత్రువులను మట్టుపెట్టడంలో కనబరిచిన ధైర్యసాహసాలకు ఆర్మీ ఉన్నతాధికారులు కమాండేషన్ కార్డ్‌తో సత్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీనివాస్‌కు సత్కారంతో పాటు ఆర్మీ నాయక్ నుంచి అవల్దార్‌గా ప్రమోషన్ లభించింది. దీంతో ఇల్లందలో ఉన్న ఆయన తల్లిదండ్రులు, బంధుమిత్రులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.



ఇండియన్ ఆర్మీ చీఫ్‌తో కమాండేషన్ కార్డ్ సత్కారం పొందుతున్న శ్రీనివాస్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

వర్ధన్నపేట, ఫిబ్రవరి 6: పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది లబ్ధిదారులకు రూ. 66,06,960 విలువ గల చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు పోకుండా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, ఆరెల్లి ప్రభాకర్, మౌస సురేశ్, దుబ్బాక శివకుమార్, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, తహసీల్దార్ విజయ్‌సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెక్కులను అందించాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, ఫిబ్రవరి 6: రైతులకు పంట నష్టపరిహారం చెక్కులను వెంటనే అందించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అకౌంట్లో రైతులకు చెందిన నష్టపరిహారం చెక్కులు ఉన్నాయని, వెంటనే రైతులకు చెక్కులను అందించాలని ఆయన డిమాండ్‌చేశారు.



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బడిబయటి పిల్లల గుర్తింపు

ఖానాపురం, ఫిబ్రవరి 06: జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు డోర్ టు డోర్ బడి బయటి పిల్లల సర్వేను మండల వ్యాప్తంగా సీఆర్పీలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో డిసెంబరు 10 నుంచి ఫిబ్రవరి 6వరకు సీఆర్పీలు నిర్వహించిన సర్వేల్లో మండల వ్యాప్తంగా చదువు మధ్యలో మానేసిన 24మంది విద్యార్థులను గుర్తించినట్లు మంగళవారం తెలిపారు. ఖానాపురం కాంప్లెక్స్ పరిధిలో ఎలిమెంటరీ లెవల్‌లో ముగ్గురు, సెకండరీ లెవల్‌లో ముగ్గురు, బుధరావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఎలిమెంటరీ లెవల్‌లో 10మంది, సెకండరీ లెవల్‌లో ఇద్దరు, అశోక్‌నగర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సెకండరీ లెవల్‌లో ఆరుగురిని గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపిచాలని సీఆర్పీలు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురంలో సర్వే చేస్తున్న సీఆర్పీ రమేష్

రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం నెక్కొండలోని రైల్వేస్టేషన్, హైస్కూల్ రోడ్లను, రైల్వే అండర్ బ్రిడ్జిని ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. నెక్కొండ రైల్వే స్టేషన్ నుంచి వట్టివాగు, హై స్కూల్ నుంచి బీసీ కాలనీ రోడ్డు వరకూ ఇరువైపుల మురికి కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రైల్వే అండర్ బ్రిడ్జికి ఇరువైపుల గోడల నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతంలోని చిరువ్యాపారులు జీవనోపాధిని కోల్పోయారన్నారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకు సాధ్యమైనంత మేర బ్రిడ్జి గోడల ఎత్తును తగ్గిస్తామన్నారు. అలాగే అండర్ బ్రిడ్జిలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మరమ్మతులకు గాను పీడీఎఫ్ నిధుల నుంచి ఐదు లక్షలను మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. స్థానిక యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులు లేని కారణంగా పాఠశాల శిథిలావస్థకు చేరుకుంటుందని ఈ పాఠశాలను మరమ్మతు చేయించి పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నర్సంపేట ఆర్‌అండ్‌బీ డీఈ రమాదేవి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ, యూత్ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, రావుల షైపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, నాయకులు రాచకొండ రఘు, కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఏఈ రాకేశ్, వ్యాపారులు పాల్గొన్నారు.



నెక్కొండలో రోడ్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

పల్లెప్రకృతివనం ధ్వంసంపై ఫిర్యాదు

నల్లబెల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని అర్వయ్యపల్లిలో ప్రభుత్వభూమిలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతివనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి అఖిల మంగళవారం ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హైవే 365 పక్కన ఉన్న పల్లె ప్రకృతివనంలో ఈనెల 5న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సహాయంతో మొక్కలను ధ్వంసం చేశారని, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడంతో సుమారు 300 మొక్కలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

ముగ్గురు నకిలీ విలేకరుల అరెస్టు

నల్లబెల్లి, ఫిబ్రవరి 6: వరంగల్‌కు చెందిన ముగ్గురు నకిలీ విలేకరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నైనాల నగేష్ మంగళవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని పద్మాపురం గుట్ట నుంచి ట్రాక్టర్ల ద్వారా మొరంను గ్రామాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తాము విలేకరులమంటూ ట్రాక్టర్లను అడ్డుకుని బెదిరించి మాముళ్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత ట్రాక్టర్లకు చెందిన ఓ వ్యక్తి వారికి రూ. 5 వేలను ఫోన్ పే చేశాడు. అనంతరం వారిపై అనుమానం రావడంతో పోలీసుల ఫిర్యాదు చేశాడు.

అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని విచారించగా వారు నకిలీ విలేకరులని తేలడంతో తింగాలికర్ సతీష్, వడ్డెపెల్లి రాజు. వెల్ది రాజేందర్‌లుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

నెక్కొండ, ఫిబ్రవరి 6: నెక్కొండ మండలం అలంకానిపేట విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న అలంకానిపేట గ్రామానికి చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై షెక్ జాన్‌పాషా తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 26,050లను, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది రాకేష్, ఖాజా, వెంకన్నలు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 6 : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట మండలం మగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య తన ద్విచక్రవాహనంపై నర్సంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇదే మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన లింగాల దేవేందర్ పాపయ్యపేట నుంచి నర్సంపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కింద పడిపోయిన మల్లయ్య, దేవేందర్‌లకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నర్సంపేట నుంచి మేడారం బస్‌సర్వీస్ ప్రారంభం

నర్సంపేట, ఫిబ్రవరి 6 : నర్సంపేట ప్రాంతం నుంచి మేడారం సమ్మక్క, సారలమ్మజాతరకు వెళ్లే భక్తుల కోసం నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి నేటి నుంచి నర్సంపేట, మేడారం బస్సుసర్వీసును ప్రారంభించడం జరుగుతుందని డిపోమేనేజర్ ప్రసూనలక్ష్మి మంగళవారం తెలిపారు. నర్సంపేట నుంచి ఉదయం 6గంటలకు, సాయంత్రం 4గంటలకు మేడారంనకు బస్‌సర్వీస్ నడుస్తుందన్నారు. మేడారం నుంచి ఉదయం 9.30 గంటలకు, సాయంత్రం 7గంటలకు నర్సంపేట బస్ సౌకర్యం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నర్సంపేట నుంచి గత సంవత్సరం మేడారం జాతరకు 150 బస్సులతో 2046 ట్రిప్పులు నడిపి 54, 486 మంది భక్తులకు సౌకర్యం కల్పించామన్నారు. ఈ సంవత్సరం 245 బస్సులతో 3153 ట్రిప్పుల ద్వారా 81, 730మంది ప్రయాణీకులను జాతరకు చేరవేయడానికి ఏర్పాటు చేస్తున్నాయని డీఎం వివరించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎం ప్రసూనలక్ష్మి

గృహజ్యోతి ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

వర్ధన్నపేట, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఆన్‌లైన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చేపట్టిన ఆన్‌లైన్ ఎంట్రీని క్షేత్రస్థాయిలో ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ వి.మోహన్‌రావు పర్యవేక్షించారు. అర్హులైన వారికి ఈ పథకం తప్పకుండా వర్తిస్తుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో డీఈఈ బి.భిక్షపతి, ఏఏవో పి.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎల్ఎం ఎస్.ప్రశాంత్, కంప్యూటర్ అసిస్టెంట్ సూరిబాబు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మోహన్‌రావు

రగ్బీ చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ఐనవోలు మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ(బాలుర) సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు ఆరో రాష్ట్రస్థాయి అండర్ - 14 రగ్బీ ఛాంపియన్ షిప్‌తో తమ ప్రతిభను చాటారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభను చాటి ట్రోఫిని అందుకున్న విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రచారి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఈనెల 3,4 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలో జరిగిన బాలబాలికల రగ్బీలో ప్రతిభ చాటడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 6 : వరి, మొక్కజొన్న పంటలు వేసిన రైతులు వాటిలో తెగులు నివారణ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ సూచించారు. మంగళవారం వర్ధన్నపేట మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఇల్లందలో ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ పి. సారంగం, జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి కృష్ణారెడ్డిలతో కలిసి వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి తెలుసుకోవడానికి ఎకరాకు 8 లిం గాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. ఈ లింగాకర్షక బుట్టలను అమర్చిన వారానికి 25-30 మగ రెక్కల పురుగులు గమనించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. 20-25 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు 10 కిలోలు లేదా క్లోరంట్రానిలీ ప్రోల్ 4 జీ గుళికలు 4 కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రాక్లోరైడ్ ఫోర్ జీ గుళికలు 8 కిలోలు ఎకరాకు సమానంగా ఇసుకలో కలుపుకుని పల్చగా నీరు ఉంచుకుని కలిపే విధంగా పిలక దశలో చల్లుకోవాలని సూచించారు.



ఇల్లందలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీఏ ఉషాదయాల్

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మొదటి దశలో వేపనూనె 5మి.లీ లేదా ఇమామ్యాక్టిన్ బెంజోయేట్ (ప్రోక్లేమ్) 0.4 గ్రాములు లేదా స్పైనోసాడ్(ట్రేసర్) 0.3 మి. లీ లేదా క్లోరాంట్రనిప్రోల్ (కోరాజెన్) 0.3 మి.లీ ఒకరు లీటరు నీటి చొప్పున కలుపుకుని మొగిలోపల, సుడిలో పడే విధంగా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాంనర్సయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 6 : భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, హాస్టల్ వార్డెన్, ఆటో డ్రైవర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్, ఆటో డ్రైవర్‌లు ఇద్దరు కలిసి విద్యార్థినులను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, సంఘటన జరిగి రెండు రోజులు గడిచినా ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

ఇప్పటికైనా హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, నిఖిల్, వంశీ, శ్రీకాంత్, సంతోష్, మోహన్, కిశోర్, నితిన్ పాల్గొన్నారు. ఇదిలావుండగా విద్యార్థినుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఆర్డీవో కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఆబర్ల విక్రమ్, ప్రశాంత్, శివ, అనిల్ పాల్గొన్నారు.

మహాజాతరకు నేడు అంకురార్పణ

మేడారంలో గుడిమెలిగే పండుగకు సర్వం సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడిమెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు.

పోలీసు పోస్టింగుల్లో పొలిటికల్ వార్!

5వ పేజీ తరువాయి

పోటాపోటీగా సిఫారసు లేఖలు ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసుల బదిలీల్లో రాజకీయం జోక్యం మితిమీరిపోతుండటం చర్చనీయాశంగా మారింది. ప్రతీ జిల్లాలో ఎమ్మెల్యేలు ఒక పేరు సూచిస్తే.. మంత్రులు ఇంకో పేరు సూచిస్తూ సిఫారసు లేఖలను పోలీసు ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. దీంతో 'కరవమంటే కప్పకు.. విడవ మంటే పాముకు కోపం' అన్న చందంగా పోలీసు పైరవీలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. మంత్రుల సిఫారసు లేఖలను అమలు చేయాలా? ఎమ్మెల్యేల లేఖలకు విలువ ఇవ్వాలా? తెలియక ఉన్నతాధికారులు బదిలీపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారట. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐ, ఏసీపీ, డీసీపీల బదిలీలంటూ నాలుగైదు రోజులుగా ప్రచారం జరుగుతున్నా ఆర్డర్స్ మాత్రం బయటకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లే కారణమనే చర్చ జరుగుతుండగా.. ఒకేసారి భారీగా బదిలీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో కొందరు పోలీసు అధికారులు కూడా తమకు ఇష్టమైన పోస్టింగు కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి దగ్గరి వారికి వారు పోస్టింగుల కోసం సిఫారసు లేఖలు ఇస్తున్నారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య అంతర్గతంగా వాగ్వాదం జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే 'నా నియోజకవర్గంలో వేలు పెడితే ఊరుకునేదే లేదు. నీకు దండం పెడుతా నా పని నన్ను చేసుకొనివ్వు' అంటూ మంత్రితో వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. కాగా, రాజకీయ నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పార్లమెంట్ ఎన్నికల వరకు ఎలాంటి బదిలీలు వద్దని జిల్లా, కమిషనరేట్ పోలీసు బాసులు పై అధికారులకు సూచిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య బదిలీలపై మనస్పర్థలు పెరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బదిలీలపై ఆశతో ఉన్న పోలీసు అధికారులకు ఇప్పట్లో బదిలీలు ఉంటాయా.. లేక మేడారం మహాజాతర, పార్లమెంట్ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందేనా అనే ఉత్కంఠతో ఉన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

రాయపర్తి, ఫిబ్రవరి 6 : దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామిలు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రెండు నెలల పారితోషకాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, ఏఎన్‌సీల టార్గెట్ పేరుతో ఆశాలపై ఉన్న వేదింపులను అరికట్టాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంకు నిధులు విడుదల చేసి బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తుమ్మల సాంబయ్య, నాగమణి, చైతన్య, రాధిక, మాధవి, రేణుక, పద్మ, నీల, శోభ, కళ్యాణి, స్రవంతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్, జలగం భిక్షపతి, ల్యాదెళ్ల ఆరోగ్యం, జలగం మోహన్, తుమ్మల వేణు, భుజంగం, జలగం రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలుడి స్కూలు బ్యాగులో పాము

• త్రుటిలో తప్పిన ప్రమాదం • ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

నెక్కొండ, ఫిబ్రవరి 6 : ఆడుతూ పాడుతూ రోడ్డు వెంట పాఠశాలకు వెళ్తున్న బాలుడి స్కూల్ బ్యాగ్ నుంచి తాచుపాము బయటపడిన సంఘటన మంగళవారం నెక్కొండలో చోటు చేసుకుంది. బాలుడు ఈదునూరి వివేక్ తల్లిదండ్రులు విజేందర్, మమత దంపతులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... నెక్కొండలోని పీఎస్ పాఠశాలలో శిశు తరగతి చదువుతున్న ఆరు సంవత్సరాల వివేక్ తన స్కూల్ బ్యాగ్ తీసుకుని ఇంటినుంచి పాఠశాలకు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వివేక్ బ్యాగ్ నుంచి పెద్ద తాచుపాము రోడ్డు పైన పడింది. వివేక్ వెనుక నడుచుకుంటూ వెళ్తున్న అతని స్నేహితులు పామును చూసి పెద్దగా అరవడంతో రోడ్డుపై పడిన పాము పడగవిప్పి బుసలు కొడుతూ పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. వివేక్ భయంతో బ్యాగ్ రోడ్డుపైన పడేసి పరుగులు తీశాడు. ఈ క్రమంలో విద్యార్థుల అరుపులతో అక్కడకు చేరుకున్న స్థానికులు బ్యాగ్‌లో ఇంకా ఏమైనా ఉన్నాయా అని పరిశీలించి ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం తమ ఇంట్లోకి పాము చొరబడిందని ఇంట్లో ఎంత వెతికిన కనిపించలేదని అయితే పాము బయటకు వెళ్లిపోయి ఉంటుందని తాము భావించామని వివేక్ తల్లిదండ్రులు తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని చెరువుకొమ్ముతండాకు, బోడ మాణిక్యంతండాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కను ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు పనులను మంగళవారం కార్యదర్శి అశోక్ జీపీ సిబ్బంది చేత చేయించారు. ఈనెల 1న ఆంధ్రజ్యోతి జిల్లా ట్యాబ్లాయిడ్‌లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ తాగునీరు అనే కథనం ప్రచురితం కాగా స్పందించిన అధికారులు పైపులైన్ మరమ్మతు పనులను చేపట్టి ఆయా గ్రామాలకు తాగు నీరందించారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 6: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా మాట్లాడటం మానుకుని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య మండల అధికార ప్రతినిధి కంది ఎల్లస్వామి, ఎస్సీసెల్ నాయకుడు దుబ్బ ఎల్లయ్య పాల్గొన్నారు.

● రాయపర్తి: సీఎం రేవంత్‌రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం రాయపర్తి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు చినపాక ఎల్లయ్య, చిర్ర మల్లయ్యలు మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై సుమన్ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని కేసు నమోదు చేయాలని కోరారు.

● పర్వతగిరి: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు సిగ్గుచేటని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే బేషరతుగా సీఎంకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, నాయకులు చలపతిరావు, సైదులు, కనకరాజు, స్కైలాబ్‌బాబు, రవీందర్, భాస్కర్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.